క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



ఇన్‌స్పైర్ ప్రాజెక్టులకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి

మునగపాక : చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని పాటిపల్లి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి కోరారు. మోడల్ స్కూల్‌కు చెందిన పలువురు విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు జిల్లా స్థాయికి ఎంపికయ్యాయి. ఈ మేరకు బుధవారం సంబంధిత విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోటీ కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా విజ్ఞానం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదవడంతో పాటు ఇతర రంగాలపై దృష్టి సారించాలన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



పరమేశ్వరరావు

మునగపాక : తోటాడ పంచాయతీ మాజీ సర్పంచ్ బుద్ద పరమేశ్వరరావు (76) బుధవారం మృతి చెందారు. 13 సంవత్సరాలుగా తోటాడ పంచాయతీకి ఆయన సర్పంచ్‌గా సేవలందించారు. అలాగే డీసీఎంఎస్ చైర్మన్‌గా పనిశారు. కొంతకాలంగా పరమేశ్వరరావు అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. ఎరమేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పరమేశ్వరరావు అంత్యక్రియలు స్వగ్రామం తోటాడలో ఘనంగా నిర్వహించారు. తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాల నుంచి ఆయన అంత్యక్రియల్లో పలువురు పాల్గొని సంతాపం తెలిపారు. కాగా పరమేశ్వరరావు భౌతికకాయానికి ఆయన మనుమడు తలకొరివి పెట్టి రుణం తీర్చుకున్నారు.

బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా శ్రీనివాస్



కృష్ణయ్య నుంచి నియామక పత్రం అందుకుంటున్న శ్రీనివాస్

రాంబిల్లి : ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా చింతకాయల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాడనర్సాపురానికి చెందిన శ్రీనివాస్ నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రెసిడెంట్ ఆర్. కృష్ణయ్య చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు.

వాహన తనిఖీలు

రాంబిల్లి : నారాయణపురం జంక్షన్ వద్ద బుధవారం ట్రాఫిక్ ఎస్ఐ ఈశ్వరరావు వాహన తనిఖీలు చేపట్టారు. నిబంధనలు పాటించని, తగిన ధ్రువీకరణ పత్రాలు లేనివారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రహదారి విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం



మాట్లాడుతున్న అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ

మునగపాక : రహదారి విస్తరణ బాధితులకు మెరుగైన పరిహారం అందిస్తామని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని ఒంపోలు, తిమ్మరాజుపేట ప్రాంతాల్లో ఆయన పూడిమడక రోడ్డు విస్తరణ బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013 భూ చట్ట ప్రకారం భూములు, గృహాలు కోల్పోయే వారికి మెరుగైన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తహసీల్దార్ బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి బొద్దపు శ్రీరామమూర్తి, తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ పాల్గొన్నారు.

ముందస్తు సంక్రాంతి... చిన్నారుల సందడి



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినులు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న చిన్నారులు, ఆకట్టుకున్న ముగ్గులు

అచ్యుతాపురం(అనకాపల్లి) : సంక్రాంతి సందడి ముందే వచ్చేసింది. అచ్యుతాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం ముందస్తు సంక్రాంతి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. హరిపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి, సాంస్కృతిక నృత్యాలు ప్రదర్శించారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. భోగి మంటలు, గొబ్బెమ్మలతో అలంకరించారు. హరిపాలెం ఉన్నత పాఠశాల హెచ్ఎం జగదీశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మిగిలిన ప్రభుత్వ పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

కేజీబీవీలో సంక్రాంతి సంబరాలు

నక్కపల్లి : మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలసి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. భోగి మంట వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. భోగిమంట చుట్టు బాలికలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. స్పెషల్ ఆఫీసర్ త్రివేణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లి : చందనాడ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం సంక్రాంతి సంబరాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పాఠశాల విద్యార్థులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భోగిమంటలు వేశారు. ముగ్గుల పోటీలు నిర్వహించారు. చిన్నారులతో నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు గోమాతకు పూజలు నిర్వహించారు. ఎంఈవో డీవీడీ ప్రసాద్, సర్పంచ్ తళ్ల రోహిణీ భార్గవ్, ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పలస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మునగపాక : మునగపాకలోని ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి పండగ, రంగవల్లులతో సందడి చేశారు. సంప్రదాయ వేషధారణలో విద్యార్థులు అలరించారు.

ఎస్.రాయవరం: మండలంలో బుధవారం పలు పాఠశాలలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. బాలికలతో ముగ్గుల పోటీలు, గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి సందడి చేశారు. భోగి, సంక్రాంతి, కనుమ విశిష్టతను వివరించిన ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సంబరాల్లో పాల్గొన్నారు.

యలమంచిలి : స్థానిక శ్రీ చైతన్య స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాలలో భోగిమంటలు వేసి రంగవల్లికలు అద్దారు. సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ముందస్తు సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు ఎంతో ఆనందంగా పాల్గొన్నారని ప్రిన్సిపాల్ హృషికేష్ అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీ ప్రకాష్‌లో సంక్రాంతి సంబరాలు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలలో సంక్రాంతి వేడుకలు ఎంతో ఘనంగా జరుపుకొన్నారు. పిల్లలకు సంప్రదాయ విలువలు, మానవతా విలువలు నేర్పేలా సంబరాలు జరిపారు. ట్రెజరర్ శ్రీ ప్రకాష్ ఎడ్యుకేషనల్ సొసైటీ చిట్టూరి రామ సీత జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. పొంగలి వండడం, గాలిపటాలు ఎగురవేయడం, భోగిమంట వేయడం, చిన్నపిల్లలకు భోగి పళ్ళు పోయడం, ముగ్గుల పోటీలు నిర్వహించడం ఇలా పల్లె వాతావరణాన్ని కన్నుల కట్టినట్టుగా చూపించారు. తెలుగుతనం ఉట్టిపడేలా పిల్లలందరూ సంప్రదాయ దుస్తులను ధరించి ఆటపాటలతో సందడి చేశారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భానుమూర్తి, ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, ఉషారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.



కేజీబీవీలో బాలికలు వేసిన ముగ్గులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు



హరిదాసుకి సరుకులు సమర్పిస్తున్న శ్రీప్రకాష్ చిన్నారులు



పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలలో ఉపాధ్యాయులు

కోటవురట్ల: పాములవాక జెడ్పీ హైస్కూల్, రాజుపేట ఎంపీయూపీ స్కూల్స్‌లో సంక్రాంతి సంబరాలను తెలుగువారి సంప్రదాయం ఉట్టిపడేలా వైభవంగా నిర్వహించారు. అచ్చమైన సంక్రాంతి పండుగను చూస్తున్న భావన కలిగేలా భోగి మంటలు, రంగవల్లికలు, చెరకు గెడలు, మామిడి తోరణాలతో అలంకరణ విశేషంగా ఆకట్టుకున్నాయి. సంప్రదాయ దుస్తులు ధరించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాలు పొంగించి నమస్కరించారు. హెచ్ఎం టి.రవిశంకర్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమలక్ష్మి, రమణ, చిరంజీవి, కరుణకుమార్, నాగేశ్వరరావు, కుమార్, పీడీ అచ్యుతరావు పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో సంక్రాంతి సంబరాల్లో ముగ్గులు వేస్తున్న ఉపాధ్యాయులు



మునగపాక ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



శ్రీ చైతన్యలో సంక్రాంతి సంబరాల్లో బొమ్మల కొలువు



భోగి మంట చుట్టూ చిన్నారుల నృత్యం

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పాయకరావుపేట : మండలంలో గల కుమారపురం ఎంపీయూపీ పాఠశాల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. స్వామి వివేకానంద 160 వ జయంతి సందర్భంగా సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు పాల్గొన్నారు.

రీ-సర్వేతో రైతులకు మేలు

మునగపాక : సమగ్ర భూ రీ-సర్వే ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత అల్లవరపు రమణబాబు అన్నారు. పల్లపు ఆనందపురంలో జరుగుతున్న రీ-సర్వే పనులను ఆయన బుధవారం పరిశీలించారు. గతంలో సరిహద్దులకు సంబంధించి వివాదాలు జరుగుతుండేవని, ఇక అలాంటి సమస్యలకు చెక్ పెట్టేందుకు రీ-సర్వే దోహదపడుతుందని అన్నారు.

నేడు కొరుప్రోలులో గడప గడపకు

ఎస్.రాయవరం : కొరుప్రోలు గ్రామంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమానికి పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరవుతున్నట్టు చెప్పారు. మండల అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

ప్రైవేటు పాఠశాలలో చోరీ

యలమంచిలి : ప్రైవేట్ పాఠశాలలో చోరీ జరిగినట్టు బుధవారం సాయంత్రం పట్టణ ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు. వివరాలివి. పట్టణంలో దిమిలి రోడ్డులో గల విజ్ఞాన భారతి స్కూల్లో మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి, సీసీ కెమెరాలను పగలగొట్టడంతో పాటు ల్యాప్‌ట్యాప్ అపహరించారని పోలీసులకు ఫిర్యాదు అందింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ బషీర్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

నేడు వివేకానంద జయంతి వేడుకలు

పోస్టర్ ఆవిష్కరించిన నిర్వాహకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని పూడిమడక గ్రామంలో ఈ నెల 12న వివేకానంద జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్టు శ్రీ స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా యూత్ ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ మేరకు బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కడపాలెం సతకంపట్టు వద్ద వృద్ధులకు, వితంతులకు దుప్పట్లు పంపిణీ, చిన్నారులకు పుస్తకాల పంపిణీ, అదే విధంగా రక్త దానం నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో చోడపల్లి అప్పారావు, మేరుగు అప్పలనాయుడు, సూరాడ సత్తిబాబు, మేరుగు మహేశ్, ఏరిపల్లి గణేశ్, మైలపల్లి రాము, మైలపల్లి చంటి పాల్గొన్నారు.


జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం



పి.ధర్మవరంలో గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : ప్రతి ఇంటికి సంక్షేమ పథకం అందించిన నేత సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. పి.ధర్మవరం గ్రామంలో బుధవారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ముద్రించిన కరపత్రాలు అందించి కుటుంబ యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే సహకారాలు అన్నీ సకాలంలో వస్తున్నాయా లేదా అని ప్రశ్నించారు. దీంతో వృద్ధులు తాము నిద్ర లేవకుండానే ఇంటివద్దకు ఒకటో తేదీన పింఛను నగదు గ్రామ వలంటీర్ తీసుకువస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెదుళ్ల బంగారి, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మైలారు శ్రీనివాస్‌రావు, అద్దేపల్లి నూకునాయుడు, నాగబాబు, మాణిక్యం పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ఉద్యమం కావాలి



జీవామృతం తయారు చేసే విధానాన్ని చూపిస్తున్న ప్రతినిధులు

కోటవురట్ల : సహజ వనరులను వినియోగించి తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయం చేసేందుకు రైతులు ముందుకు రావాలని రైతు సాధికార సంస్థ రాష్ట్ర రీసోర్స్‌పర్సన్, ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పాలకవర్గ సభ్యులు పి.దేవుళ్లు కోరారు. టి.జగ్గంపేట శివారు తడపర్తి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ప్రాధాన్యతను వివరిస్తూ బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. దేవుళ్లు మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగు మందులు ఇష్టానుసారంగా వినియోగించడం వల్ల భూమి సారాన్ని కోల్పోవడమే కాకుండా ఆ పంటలను ఆహారంగా తీసుకోవడం వల్ల కేన్సర్, దీర్ఘకాలిక వ్యాధులకు గురవుతున్నారన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ఓ ఉద్యమంలా చేపట్టడం ద్వారా పూర్వపు ఆరోగ్యవంతమైన జీవనాన్ని పొందవచ్చన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్యంపై శ్రద్ధ వహించండి



సత్యవరంలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఈవోఆర్డీ

పాయకరావుపేట : గ్రామాల్లో పారిశుద్ధ్యలోపం లేకుండా గ్రామ సచివాలయ సిబ్బంది శ్రద్ధ వహించాలని ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్ అన్నారు. ఆయన బుధవారం మండలంలో గల సత్యవరం, మంగవరం, మాసాహెబుపేట గ్రామాలను పరిశీలించి చెత్త నుంచి సంపద కేంద్రాలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు. చెత్త నుంచి సంపద పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయాలన్నారు.

ఘనంగా ప్రపంచ హిందీ దినోత్సవం



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్టీపీసీ అధికారులు

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రపంచ హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంస్థ జీజీఎం సంజయ్ కుమార్ సిన్హా మాట్లాడుతూ అధికార భాష హిందీని రోజు వారీ పనుల్లో గరిష్ఠంగా ఉపయోగించాలని సూచించారు. ఆపరేషన్ జీఎం డీపీ పాత్రో హిందీ వినియోగంపై సంస్థ ప్రధాన అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్ఆర్ ఏజీఎం రుమాడీ శర్మ హిందీ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. దీపిక లేడీస్ క్లబ్ సహకారంతో అంత్యాక్షరి పోటీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆన్‌లైన్ హిందీ క్విజ్‌లో ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

పేకాడుతున్న ఇద్దరు అరెస్టు

మునగపాక : అరబుపాలెం శివారు పేకాడుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని రూ.2100 నగదు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ చల్లా భీమరాజు తెలిపారు. మునగపాక నుంచి అరబుపాలెం వెళ్లే మార్గంలో ముందస్తు సమాచారంతో ఎస్ఐ భీమరాజు తన సిబ్బందితో దాడి చేసి పేకాడుతున్న వారిని పట్టుకున్నారు.

రైతుల సమస్యలు సకాలంలో పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

యలమంచిలి : రైతుల సమస్యలు అందుబాటులో ఉండి సకాలంలో పరిష్కరించాలని జిల్లా వ్యవసాయాధికారి డి.మోహనరావు అన్నారు.యలమంచిలి వ్యవసాయకార్యాలయంలో నెల వారి సమీక్ష సమావేశంలో భాగంగా నియోజకవర్గంలోని 4 మండలాల వ్యవసాయాధికారులు సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీఎమ్ కిసాన్ కి సంబంధించి పెండింగ్‌లో ఉన్న రైతులను గుర్తించి వారికి అందేలా చూడాలని, రబీలో సాగు చేయు పంటల వివరాలను ఈ పంటలో నమోదు చేయాలని, ఈ కేవైసీ ఫిబ్రవరి 15వ తేదీలోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. యలమంచిలి సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ ఏడీఏ సుమంత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల సరఫరా



పట్టణంలో గల గ్రంథాలయానికి వచ్చిన పుస్తకాలు

పాయకరావుపేట పట్టణంలో గల శాఖా గ్రంథాలయానికి జిల్లా గ్రంథాలయం నుంచి పుస్తకాలు వచ్చినట్టు గ్రంథాలయాధికారి వామాల లక్ష్మణరావు తెలిపారు. పురాణ ఇతిహాసాలు, పాఠ్యాంశాలు, పోటీ పరీక్షల పుస్తకాలు రావడం జరిగిందన్నారు. తెలుగు, ఇంగ్లిషు, హిందీలకు చెందిన 12 వేల పుస్తకాలు సరఫరా చేయడం జరిగిందన్నారు. ఎక్కువ మొత్తంలో వివిధ పుస్తకాలను పంపించినందుకు జిల్లా గ్రంథాలయ శాఖ చైర్‌పర్సన్ కొండా రమాదేవికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి అవతారంలో శ్రీరాముడు

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామమందిరంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీరామచంద్రుడు శ్రీవారి అవతారంలో దర్శనమిచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కొండకర్లలో మేలుకొలుపులు



కొండకర్లలో మేలుకొలుపులు నిర్వహిస్తున్న భక్తులు



చూచుకొండలో శివపార్వతుల చిత్రపటాలతో ఊరేగింపు

అచ్యుతాపురం(అనకాపల్లి): కొండకర్లలో గురువారం మేలుకొలుపు నిర్వహించారు. తెల్లవారు జామునే లేచి నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు. తెల్లవారు జామున నగర సంకీర్తన చేపట్టడం వల్ల దేవుని ఆశీస్సులు ఉండడంతో పాటు, ఆరోగ్యం కలుగుతుందని సమరసతా సేవా ఫౌండేషన్ అచ్యుతాపురం సబ్ డివిజన్ ధర్మ ప్రచారకులు కొల్లి అప్పారావు తెలిపారు. గుడివాడ రమణ, ధార్మిక జట్టు సభ్యులు పాల్గొన్నారు.

మునగపాక : ధనుర్మాస పూజల్లో మునగపాక గౌరీపరమేశ్వరుల ఆలయంలో మహిళలు బుధవారం గోదాదేవికి పూజలు చేశారు. చూచుకొండలో పలువురు భక్తులు మేలుకొలుపుల్లో పాల్గొన్నారు. శివపార్వతుల చిత్రపటాన్ని ఊరేగిస్తూ భజనలు చేశారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్ర ం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

నక్కపల్లి : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం పలువురు అంగన్‌వాడీ వర్కర్లు తహసీల్దార్ సుబ్రహ్మణ్యశాస్త్రికి వినతిపత్రం ఇచ్చారు. అంగన్‌వాడీ వర్కర్లకు వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఫేస్ యాప్ విధానం రద్దు చేయాలని వైఎస్సార్ సంపూర్ణ యోజన పథకం మెనూ చార్జీలు పెంచాలని గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని పదవీ విరమణ అనంతరం రూ.5 లక్షలు చెల్లించాలని సూపర్‌వైజర్ల నియామకాల్లో వయోపరిమితి తొలగించాలని, 300 జనాభా దాటిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తించాలని ఆయిల్, కందిపప్పు పెంపుదల చేయాలని, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్ల నాయకులు దుర్గారాణి, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

పీహెచ్‌సీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

ఎంపీపీ బోదెపు గోవింద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి : రాష్ట్రంలో, పల్లెల్లో పట్టణాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. బుధవారం రేగుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు హోదాలో ముఖ్య అతిథిగా పాల్గొని ఆస్పత్రి అభివృద్ధిపై కమిటీ సభ్యులతో కలసి ఆస్పత్రిలో అందుతున్న సేవలపై వైద్యాధికారులను ప్రజాప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రి ఆవరణలో పారిశుధ్యం లోపించడంతో అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వైద్యులు సమయపాలన పాటించడం లేదని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను ప్రవేశపెట్టిందని, వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి సకాలంలో వైద్య సేవలందించాలని తెలిపారు. ఆస్పత్రిలో మౌలిక వసతులకు ఎంత మొత్తం ఖర్చు పెట్టారని ఆస్పత్రిలో రికార్డులను తనిఖీ చేసి వైద్యులు మూమెంట్ రిజిస్టర్‌లో సంతకాలను పరిశీలించారు. ఆస్పత్రిలో మందులు కొరత లేకుండా చూడాలని, ఆస్పత్రి ఆవరణలో ఎప్పటికప్పుడు పారిశుధ్యంపై చర్యలు చేపట్టాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రేగుపాలెం సర్పంచ్ రాజాన మహలక్ష్మి, కొత్తలి సర్పంచ్ మర్రి రాజుబాబు, లైనుకొత్తూరు సర్పంచ్ కొల్లి త్రినాథ్, ఎంపీడీవో ప్రసాద్, వైద్యాధికారులు శిరీష, నెహ్రూ, సుబ్బారావు పాల్గొన్నారు.